చేపపిల్లల సరఫరా సక్రమమేనా?

- ఎవరికీ పట్టని తీరు
- నేటి నుంచి పంపిణీ



గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి ఏటా మత్స్య సహకార సంఘాలకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఈ కార్యక్రమం చేపట్టినప్పటి నుంచి మత్స్యకారులు జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పులు కనిపించకపోగా. . అధికారులు, కాంట్రాక్టర్లు భారీగా లబ్ధిపొందుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఏడాది సరఫరాను 50 శాతం తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లాకు ఉచితంగా అందించాల్సిన చేప పిల్లల సంఖ్య ఒక కోటీ 78 లక్షలు కాగా అందులో 50 శాతం అంటే 89 లక్షలు మాత్రమే పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించిందని అధికారులు అంటున్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంగాల చెరువులో చేప పిల్లలను వదలడానికి మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 365 చెరువులు, 8 రిజర్వాయర్లు, కుంటల్లో చేప పిల్లలను వదలడానికి సన్నాహాలు చేస్తున్నారు.

సభ్యులకు సమాచారం ఇస్తున్నాం

జిల్లాలోని చెరువుల్లో, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదిలే సమయంలో నిబంధనలు కచ్చితంగా పాటిస్తున్నాం. సైజులో ఏ మాత్రం తేడాలు ఉన్నా తిరస్కరిస్తున్నాం. చేప పిల్లలను మత్స్య సహకార సంఘాల పాలక వర్గాల సభ్యులకు చూపిస్తున్నాం.

-షకీలాబానో, జిల్లా మత్స్యశాఖ అధికారిణి

నిబంధనలు ఇలా

మత్స్యశాఖ నిబంధనల ప్రకారం పెద్ద మొత్తంలో ఒకే సారి చేప పిల్లలను రిజర్వాయర్లలో వదలడానికి ముందు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఎంత పెద్ద మొత్తంలో వదులుతున్నారో ఆ సంఖ్యను ముందుగా ఆయా సంఘాలను తెలియజేయాలి. దాంతో పాటు చేప పిల్లల నాణ్యత, సంఖ్యలో తేడాలు ఉన్నట్లు మత్స్యకారులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకుని వస్తే, వాటిని తిరస్కరించే అధికారం జిల్లా మత్స్యశాఖ అధికారికి ఉంటుంది. కిలోకు 300 - 350 చేప పిల్లలు రావాలి, ఎక్కువ వస్తే, సైజు తక్కువగా ఉన్నాయని అధికారులు తిరస్కరించవచ్చు. కానీ ఎంపిక చేసిన లారీల్లోని డ్రమ్‌లో చేప పిల్లలను నమూనాగా తీసుకుని వచ్చి అందరి ముందు తూకం వేస్తారు. అవి బాగానే ఉంటాయి. అన్ని డ్రమ్ముల్లో అలాంటి చేప పిల్లలే ఉన్నాయని గుత్తేదారులు నమ్మించి వదులుతున్నారని, ఆ మేరకు ఉండటంలేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. అలాగే 30-40 సైజు చేప పిల్లలను ఒక కప్పు తీసుకుని లెక్కిస్తారు. గుత్తేదారులు పెద్ద పెద్ద గంపలను తీసుకుని వచ్చి అందులో చేప పిల్లలను తీసుకుని లెక్కించి వదులుతున్నారు, ఇదీ నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ కొన్నేళ్లు నుంచి ఇలానే జరుగుతోంది. నాణ్యత, సైజు తక్కువ చేప పిల్లలను సరఫరా చేసి ఏటా రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారని ఆరోపణలున్నాయి.

మళ్లీ వారికే..

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేపట్టినప్పటి నుంచి జిల్లాలో ఒకే సంస్థ చేప పిల్లల సరఫరా టెండర్లు దక్కించుకుంటోంది. ఈ ఏడాది కూడా అదే సంస్థ టెండర్లు దక్కించుకుంది. 80-100 పెద్ద సైజు చేప పిల్లను రూ.1.74 పైసలు, చిన్న సైజు 30-40 చేప పిల్లను రూ. 0.64 పైసలకు సరఫరా చేస్తోంది. ప్రభుత్వం పంపిణీ సగానికి తగ్గించిన నేపథ్యంలో ఇందులో పెద్ద సైజు చేప పిల్లలు 67.16 లక్షలు, చిన్న సైజు 21.85 లక్షలు సరఫరా చేయాలి. ఇందుకు ప్రభుత్వం రూ.2కోట్లకు పైగా వ్యయం చేస్తోంది. శుక్రవారం నుంచి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి డిసెంబర్ 31 నాటికి ముగించనున్నారు.

శైలపుత్రిగా జోగులాంబ



అలంపూర్, న్యూస్‌టుడే : జోగులాంబ ఆలయంలో గురువారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమ నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. అర్చకులు ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణ నిర్వహించారు. మొదటి రోజున అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద కొనసాగుతోంది. జలాశయంలోకి 62 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు జలవిద్యుదుత్పత్తి, 4 గేట్లు ఎత్తి 68 వేలు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి 43 వేల క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు 42 వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 46 వేలు చేరుతుండగా, దిగువకు 55 వేల క్యూసెక్కుల వదులుతున్నారు. జూరాలకు మరో రెండు రోజుల పాటు వరద నిలకడగా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

తుంగభద్ర: నదిలో గురువారం 3,291 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 8.5 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చే సరికి అది 4.9 అడుగులుగా ఉంది.

సుంకేసుల గేట్ల మూసివేత: సుంకేసులకు వరద తగ్గడంతో జలాశయం గేట్లను గురువారం మూసివేశారు. ఎగువ నుంచి కేవలం 2,950 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. కేసీ కాలువకు 2,400 క్యూసెక్కులు వదులుతున్నారు. 292 మీటర్ల గరిష్ఠ స్థాయికి డ్యాంలో ప్రస్తుత నీటిమట్టం 291.90 మీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు.



గద్వాల తొమ్మిదో వార్డులో డిజిటల్ సర్వే

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి బహుళ ప్రయోజనం కలిగించడానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డులను జారీచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని ఒక పట్టణం, ఒక గ్రామం, ఒక వార్డును ఎంపిక చేసింది. గురువారం ఎంపిక చేసిన గద్వాల పుర పరిధిలోని 9వ వార్డులో మున్సిపల్ అధికారులు డిజిటల్ సర్వేను ప్రారంభించారు. వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రత్యేకంగా రూపొందించిన ఫాంలో కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 30 ఇళ్లను సర్వే చేశారు. ఈ సర్వే మరో రెండు రోజులు కొనసాగనుంది. నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా భూ సేకరణ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సర్వే చేపట్టారు. తహసీల్దార్ మల్లికార్జున్, ఆర్వో రాజేష్, వార్డు అధికారులు అన్వర్ పాల్గొన్నారు.



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న పుర సిబ్బంది

వీవీ ప్యాట్ల తరలింపు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: పార్లమెంటు ఎన్నికల సమయంలో పనిచేయని వీవీ ప్యాట్లను హైదారాబాద్‌లోని ఈసీఐఎల్ తరలిస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. గురువారం నెలవారీ తనిఖీలో భాగంగా వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో గోదాముల్లో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. 2024 పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సమయంలో పనిచేయని 8 వీవీ ప్యాట్లను సురక్షితంగా తరలించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. తహసీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నరేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులున్నారు.



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

శక్తిపీఠంలో ఉత్సవాలు ప్రారంభం


ప్రదక్షిణ చేస్తున్న ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, మాలధారణ భక్తులు

అలంపూర్, న్యూస్‌టుడే: జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రాహ్మీ ముహూర్తంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ఈవో పురేందర్, అర్చక స్వాములు మంగళ వాయిద్యాలతో ప్రధాన ఆలయాలకు చేరుకొని ఆనతి స్వీకరించారు. గణపతి పూజలు, పుణ్యాహవాచన, కంకణధారణ, కలశస్థాపన, యాగశాలలో నాలుగు వైపులా ప్రత్యేక మండపారాధన మధ్యలో మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతులతో మహాకలశ స్థాపన చేశారు. లోక కల్యాణార్థం మహాసంకల్పం పాటించి అఖండ దీపారాధన చేశారు. షోడశోపచార పూజలు, తదితరాలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు.

శైలపుత్రిగా జోగులాంబ: ఉత్సవాల్లో మొదటి రోజు గురువారం అమ్మవారు శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వంతెన నుంచి వెళ్లలేక ఆగిన సుబాబుల్ లోడు లారీ

మొత్తుకున్నా వినలే.. ఎత్తు పెంచలే!

శాంతినగర్, న్యూస్‌టుడే: భారత్‌మాల రోడ్డు వంతెనల ఎత్తు పెంచాలని రైతులు మొత్తుకున్నా, నిరసనలు చేసినా, పనులను అడ్డుకున్నా.. అధికారులు పట్టించుకోలేదు.. యాజమాన్యం ఒప్పుకోలేదు. తక్కువ ఎత్తులో నిర్మిస్తున్న వీటి కారణంగా రైతులకు ఇదిగో ఇలా కష్టాలు తప్పవు. రాజోలి నుంచి శాంతినగర్‌కు వచ్చే రోడ్డుపైన నిర్మించిన వంతెన నుంచి వెళ్లలేక గురువారం ఆగిపోయిన సుబాబుల్ లోడు లారీ సాక్షిగా..

వేలాది గ్రామాలకు సమస్యే: గద్వాల జిల్లాలో భారత్‌మాల రహదారి ఎనభై కిలోమీటర్ల దూరం వెళుతోంది. రహదారికిరువైపులా వందలాది గ్రామాలున్నాయి. రహదారితో ప్రస్తుతం ఈ గ్రామాల నడుమ రాకపోకలు తెగిపోయాయి. అక్కడక్కడా నిర్మించిన పదుల సంఖ్యలో వంతెనలు ఇదిగో ఇలా తక్కువ ఎత్తులోనే ఉండిపోయాయి. దీంతో అటూ ఇటూ వ్యవసాయ ఉత్పత్తులతో వాహనాలు వెళ్లడం కష్టం కానుంది. కాలువ కట్టలపైనైతే ఈ రహదారిని దాటే పరిస్థితే లేకుండాపోయింది. కాలువ వరకే వంతెన నిర్మించడంతో కట్టను రహదారిలో కలిపేశారు.

నిరసనలు తెలిపినా


వంతెనల ఎత్తు విషయంలో అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు పలు ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. గట్టు మండలంలో ఏకంగా నిరాహార దీక్షలు చేపట్టారు. నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సమస్యపై మీడియాలో మొదటి నుంచీ కథనాలు వస్తూనే ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గురువారం తుమ్మిళ్ల రైతులు లారీలో సుబాబుల్ తీసుకువస్తూ బ్రిడ్జి వద్ద ఇబ్బంది పడ్డారు. ఎత్తు తక్కువగా ఉండటంతో తీసుకువచ్చిన సుబాబుల్‌లో కొన్ని కిందకు దించి బ్రిడ్జి దాటిని తర్వాత తిరిగి లోడు చేసుకున్నారు. ఇది రైతులకు ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనల కింద నుంచి సుబాబుల్, ధాన్యం, పత్తి, మిరప, జొన్న, పశుగ్రాసం లాంటివి రవాణా చేయాలంటే ఇదే పరిస్థితి ఎదురుకానుంది.


మహబూబ్‌నగర్ : రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి అలంకరణ


మహబూబ్‌నగర్ : శ్రీనివాసకాలనీ వాసవిమాత ఆలయంలో ఉమాదేవిగా దర్శనం


అచ్చంపేట: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో..


శాంతినగర్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయంలో


కల్వకుర్తి: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

సమ్మోహనం.. సుందరరూపం

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారు బాల త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. దేవాలయాల్లో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగజ్జనని దర్శనం చేసుకునేందుకు ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. -న్యూస్‌టుడే బృందం


పెబ్బేరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మహబూబ్‌నగర్ : అమ్మవారి ఆభరణాల ఊరేగింపులో ఆర్యవైశ్యులు


ఊట్కూరు: బిజ్వార్‌లో బండారు చల్లుకునే కార్యక్రమంలో భక్తులు


కొత్తకోట: కానాయపల్లి శ్రీకోటకొండమ్మ ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవిగా..


అమ్రాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు


గద్వాల : ప్రతిమను ఊరేగిస్తున్న తెలుగుపేట శివాలయం కమిటీ సభ్యులు


అయిజ అంబాభవాని ఆలయంలో..


గద్వాల: గంజిపేటలో..


ఊట్కూరు: అంబాత్రయ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఆదిత్య పరాశ్రీ స్వామి


నాగర్‌కర్నూల్: అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు సందర్భంగా బోడ్డెమ్మలు వేస్తున్న మహిళలు


అచ్చంపేట: కుంకుమార్చన చేస్తున్న భక్తులు


వనపర్తి: చిట్యాలలో..




మహబూబ్‌నగర్ : వేంకటేశ్వరకాలనీలోని రాజరాజేశ్వరీఆలయంలో భక్తుల సందడి

వృత్తి ఎస్పీ.. ప్రవృత్తి చిత్రలేఖనం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వృత్తిలో ఎస్పీగా ఉంటూ చిత్రలేఖనం, సాహిత్యాన్ని ప్రవృత్తిగా కొనసాగిస్తున్నారు రావుల గిరిధర్. తల్లి చీరలపైన వేసే డిజైన్లు, ఇంటి ఎదుట అలంకరించే ముగ్గులను చూసి చిత్రాలను గీయడంపై ఆసక్తిని పెంచుకున్నారాయన. సాహిత్యంపై మక్కువ కనబరుస్తూ కవితలు రాశారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. చిత్రాలు గీస్తూ, కవితలు రాస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు వనపర్తి ఎస్పీ గిరిధర్.

స్వచ్ఛంద కార్యక్రమాల్లో

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు రావుల క్షేమ, నిరంజనాచారిల కుమారుడు గిరిధర్. ఆయన పీజీ వరకు చదువుకున్నారు. పలు స్వచ్ఛంద కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. సామాజిక సేవల ఇష్టంగా భావించే వారు. 2007లో జరిగిన సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షల్లో జైల్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగం సాధించి వరంగల్‌లో విధులు నిర్వహించారు. 2010లో రాసిన సివిల్స్‌లో ఆయన ఉద్యోగం సాధించి డీఎస్పీగా గురజాల, భైంసా, సుల్తాన్‌బజార్, గజ్వేల్‌లో పనిచేశారు. అనంతరం పదోన్నతి పొంది మహబూబాబాద్‌లో ఏఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం పోలీసు శాఖలో అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2017లో ఎస్పీగా పదోన్నతి పొంది డీసీపీగా పనిచేశారు. ఇటీవల వనపర్తి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.

చిత్రాలను గీస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

ప్రవృత్తిలో గురువు తల్లి

తన తల్లి క్షేమను ఆదర్శంగా తీసుకుని చిత్రలేఖనంలో ఆసక్తిని పెంచుకున్నారు. ఆమెకు డిజైనింగ్‌లో ప్రవేశముంది. ఇంటి వద్ద ఆమె వేసే వివిధ రకాల డిజైనింగ్ బొమ్మలను చూసి అనుకరించేవారు. ఇంటి ఎదుట వేసే వాటిని చిత్రాల్లో ప్రదర్శించడంతో ఆసక్తి కనబర్చేవారు. ఇలా సమయం దొరికినప్పుడల్లా ఆయనకు ఆసక్తి కలిగించే బొమ్మలను గీసేవారు. ఇప్పటి వరకు 60 వరకు బొమ్మలను గీశారు. ఆయన గీసిన బొమ్మల్లో జంతుప్రపంచం, పక్షులు, చెట్లు, సెలయేరు వంటి ప్రకృతి రమణీయతలను తన చిత్రాల్లో పొందుపరుస్తున్నారు. సాహిత్యంలోనూ మక్కువ ప్రదర్శిస్తున్నారు. కవితలంటే ఆయనకు ఎంతో ప్రాణం. శోధన పేరిట ఆయన కవిత సంపుటి 2020 సంవత్సరంలో ప్రచురితమైంది. పలు కవితలతో కూడిన మరో సంపుటి అహం బ్రహ్మస్మి అనే కవిత సంపుటి ప్రచురణలో ఉంది.

సమాజ హితమే పరమావధి : సమాజ హితమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేస్తే ప్రజా సమస్యలకు తావుండదు. సేవ చేయాలన్న లక్ష్యం చిన్ననాటి నుంచే అలవడింది. పోలీసు శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉంటూ నా పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన శ్రద్ధ వహిస్తున్నా. శాంతిభద్రతలే లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నా. వృత్తిలో ఆదర్శంగా ఉంటుంటూనే పాటు ప్రవృత్తిపై సమయం దొరికినప్పుడల్లా శ్రద్ధ చూపుతున్నా.

- రావుల గిరిధర్, ఎస్పీ

పల్లె ఓటర్లు @ 23,22,054

పురుషుల కంటే 13,765 మంది మహిళలు అధికం

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించిన తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 23,22,054 ఓటర్లున్నట్లు లెక్క తేల్చింది. పురుషులు 11,54,128 మంది ఉండగా, మహిళా ఓటర్లు 11,67,893 మంది ఉన్నారు. ఇతరులు 33 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చుకుంటే మహిళా ఓటర్లు 13,765 మంది అధికంగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్లను వేరుచేసి ఈ జాబితాను గత నెల 13న ప్రచురించారు. గ్రామ పంచాయతీల్లో వీటికి సంబంధించి గత నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి ఈనెల 28న తుది జాబితా ప్రచురించగా దీన్ని ఎన్నికల సంఘం వెలువరించింది. దీని ఆధారంగా జిల్లాల వారీగా పంచాయతీలు, వార్డుల్లోని ఓటర్లతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. మరో పర్యాయం ఓటరు నమోదుకు కూడా అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

* నాలుగు జిల్లాల్లో అతివలదే పైచేయి.. : తాజాగా ప్రచురించిన గ్రామ పంచాయతీ ఓటర్ల ఆధారంగా నాలుగు జిల్లాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉన్నట్లు తేలింది. అత్యధికంగా నారాయణపేట జిల్లాలో పురుషుల కంటే మహిళలు 7,348 మంది అధికంగా ఉండటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళా ఓటర్లు ఏకంగా 5,562 మంది అధికంగా ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,118 మంది మహిళలు అధికంగా ఉన్నారు. వనపర్తి జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 753 మంది ఎక్కువగా ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పురుష ఓటర్లు మహిళల కంటే 1,016 మంది అధికంగా ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల వివరాలు, పంచాయతీలు, వార్డులు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	14	441	3,836	2,57,529	2,58,647	7	5,16,183
నాగర్‌కర్నూల్	20	464	4,140	3,23,705	3,22,689	13	6,46,407
వనపర్తి	14	260	2,366	1,83,382	1,84,135	4	3,67,521
జోగులాంబ	12	255	2,390	1,91,313	1,96,875	7	3,88,195
నారాయణపేట	11	280	2,544	1,98,199	2,05,547	2	4,03748

నవరాత్రి వేడుకల్లో రాజవంశీయులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలిటెక్నిక్ బంగ్లా పక్కన గుడిలో గురువారం నిర్వహించిన నవరాత్రి పూజల్లో రాజా రామేశ్వర్‌రావు వారసుడు రాజా కృష్ణదేవరాయుడు కుమారుడితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.


రాజవంశీయులతో అఖిల పక్ష ఐక్యవేదిక నాయకులు

అనంతరం జిల్లా అఖిల పక్ష ఐక్య వేదిక నాయకులు రాజా వారిని కలిసి సన్మానించారు. ఐక్య వేదిక అధ్యక్షుడు సతీశ్ యాదవ్ మాట్లాడుతూ తరాలుగా వస్తున్న సంప్రదాయాలను నేటికీ కొనసాగించడం స్ఫూర్తిదాయకమన్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలక పాత్ర పోషించారు.


సెంచరీతో రాణించిన నిజామాబాద్ జట్టు క్రికెటర్ విక్రాంత్‌రెడ్డి(137 పరుగులు)

● మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్ ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో విజ్ఞాన్ 59 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఆదిలాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 వద్ద కుప్పకూలింది. జట్టులో ఆల్‌రౌండర్ తక్షిల్ 39 పరుగులు చేసి 3 వికెట్లు తీశాడు. శుక్రవారం కోమటిపల్లి మైదానంలో కరీంనగర్, నల్గొండ: మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల్లో మార్పు కోసమే పాదయాత్ర

ఉండవల్లి, న్యూస్‌టుడే: భావితరాలకు ఉపయోగపడే విధంగా నడచుకునేలా ప్రజల్లో మార్పు కోసమే 'బాపూ బాటలో సత్యశోధన పాదయాత్ర' చేపట్టినట్లు విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డా. శివార్చక విజయకుమార్ అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఈ నెల 2న అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి ప్రారంభమైన (100 రోజుల్లో 1000 కి.మీ) పాదయాత్ర గురువారం ఉండవల్లికి చేరుకుంది. గ్రామస్థులకు కరపత్రాలు అందజేసి మాట్లాడారు. పిల్లలకు చిన్ననాటి నుంచే సంస్కృతి, సంప్రదాయాలను తల్లిదండ్రులు, పెద్దలు అలవాటు చేయాలన్నారు. చేనేత వస్త్రధారణకు ప్రోత్సాహం, మద్యం, మత్తు పదార్థాల నివారణ, స్వదేశీ వైద్యం ఆదరించటం, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటం, యోగా, పౌష్టికాహారం, నైతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య అందించడం తదితరాలను వివరించారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు దేవన్న, తదితరులు పాల్గొన్నారు. యాత్ర శుక్రవారం ఉండవల్లి నుంచి బొంకూరుకు సాగనుంది.


కరపత్రాలు అందజేస్తున్న శివార్చక విజయకుమార్ తదితరులు

పోలీస్ అధికారుల్లో నైపుణ్యాల మెరుగుకు కృషి : డీఐజీ



మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఏఎస్పీ రాములు, అధికారులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీస్ అధికారుల్లో నైపుణ్యాలను మెరుగుపర్చడానికి అనేక రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారుల నైపుణ్య కార్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. నేరస్థులు ఎవరూ తప్పించుకోవడానికి వీలు లేకుండా నేరాల విచారణ, పరిశోధన మెరుగుపడాలన్నారు. కార్యశాలలో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డి. జానకి, ఏఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, నాగర్‌కర్నూల్ ఏఎస్పీ రామేశ్వర్, వనపర్తి ఏఎస్పీ రామ్‌దాస్, నారాయణపేట ఏఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నర్సింహులు, గద్వాల డీఎస్పీ నరేందర్‌రావు తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్ల, న్యూస్‌టుడే : విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జడ్చర్లలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డులో నివాసముండే ఓ విద్యార్థిని(17) మహబూబ్‌నగర్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దాటాక ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తర్వాత గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

చికెన్ ధరలు



ఫాంరేటు	112–00
రిటైల్	134–00
డ్రెస్డ్	194–00
స్కిన్‌లెస్	221–00

గురుకులాల్లో చదివి.. ఎంబీబీఎస్ సీటు సాధించి


మౌనిక

రాజోలి, న్యూస్‌టుడే : రాజోలి గ్రామంలో పేదింటి వ్యవసాయ కుటుంబానికి చెందిన మౌనిక ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో 477 మార్కులు సాధించిన మౌనిక వికారాబాద్ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. వ్యవసాయ కూలీ పనులతో జీవనం గడుపుతున్న రమేశ్, మహేశ్వరి దంపతులకు నలుగురు కుమార్తెలు కాగా, మొదటి అమ్మాయి మౌనిక ఐదో తరగతి నుంచి గురుకులాల్లో చదువుకుంటూ ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాల పురపరిధిలోని నల్లకుంటకు చెందిన శ్రీహితకు మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.25 లక్షలు, మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామానికి చెందిన బుగ్గన్నకు మంజూరైన రూ.2 లక్షల విలువైన ఎల్‌వోసీని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అందించారు. కౌన్సిలర్ నాగిరెడ్డి, నాయకులు రామన్‌గౌడా, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న రక్తపోటు, మధుమేహం


గద్వాల పట్టణంలో రక్తపోటు వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే: రోజువారీ జీవన శైలి విధానంలో తీవ్రమైన పని ఒత్తిడి, తగిన శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా జిల్లాలో అసాంక్రమిత రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. 30 ఏళ్లు దాటిన ప్రతి పది మందిలో ఒకరు రక్తపోటు(బీపీ), 20 మందిలో ఒకరు మధుమేహం(షుగర్) బారిన పడుతున్నట్లుగా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడవుతోంది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అసాంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ- నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) సర్వే నిర్వహిస్తున్నారు. ఏఎన్‌ఎమ్, ఆశా కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా గత అయిదు నెలలుగా సర్వే చేపడుతుండగా, ఇందులో బీపీ, షుగర్ వ్యాధులతో పాటు, క్యాన్సర్ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సర్వే మరో 5 నెలల పాటు కొనసాగనుంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి: జిల్లా వ్యాప్తంగా 6.39 లక్షల జనాభా ఉండగా, వీరికి వైద్య పరీక్షలు అందించేందుకు 12 పీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రి, 67 వెల్‌నెస్ కేంద్రాలు, 24 ఉపకేంద్రాలున్నాయి. మొత్తం జనాభాలో 30 సంవత్సరాలు పైబడిన వారు 3.03 లక్షల మందికి పైగా ఉన్నారు. వీరందరికీ ఎన్‌సీడీ ప్రోగ్రాం ద్వారా పరీక్షలు నిర్వహించి వైద్యం అందించాల్సి ఉంటుంది. గతేడాది నిర్వహించిన సర్వేలో 48,315 మందిలో రక్తపోటు, 22,920 మందిలో మధుమేహం గుర్తించారు. ఈ ఏడాది 10 నెలలకు సంబంధించి 2,84,570 మందికి పరీక్షలు నిర్వహించాలన్నది లక్ష్యంగా ఉండగా, ఇప్పటి వరకు 1,47,283 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో 14,919 మందికి బీపీ ఉన్నట్లుగా గుర్తిస్తే.. షుగర్ పీడితులు 8,342 మంది ఉన్నట్లుగా గుర్తించారు. ప్రైవేటులో చికిత్స తీసుకుంటున్న వారు ఇంతకు రెండింతలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అలాగే క్యాన్సర్ రోగులు 111 మంది ఉన్నారు. గ్రామీణ నేపథ్యం ఎక్కువగా ఉండటంతో మహిళల్లో క్యాన్సర్ పట్ల అవగాహన ఉండక, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల బారిన పడుతున్నారు.

జీవన విధానంలో మార్పులు అవసరం: అసాంక్రమిత వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ జీవన విధానంలో మార్పులు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడంతో పాటు, వ్యాయామం, నడక జీవితంలో భాగం చేసుకోవాలని చెబుతున్నారు. బీపీ, షుగర్ నియంత్రించుకోవాలంటే సాయంత్రం ఏడు గంటల లోపే రాత్రి భోజనం ముగించాలి. ఆహారంలో పిండి పదార్థాలు తక్కువగా ఉండి, పీచు, ప్రొటీన్లు అధికంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రోజూ ఒక గంట నడక అలవాటుగా మార్చుకుంటే పలు వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చు.

గుర్తించిన వారికి చికిత్స..

ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా అసాంక్రమిత వ్యాధిగ్రస్థులను గుర్తిస్తున్నాం. ఇంకా సర్వే కొనసాగుతోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బీపీ, షుగర్ రోగులకు స్థానిక పీహెచ్‌సీల నుంచి చికిత్స అందిస్తున్నాం. ఏఎన్‌ఎమ్, ఆశాలు వారిపై నిఘా ఉంచుతున్నారు. రోగులకు పీహెచ్‌సీలలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటులో చికిత్స కోసం వెళ్తున్న వారికి అవగాహన కల్పిస్తాం. ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లను మార్చుకోవడం, వ్యాయామం అలవాటుగా మార్చుకోవాలి.

-డా.సిద్ధప్ప, డీఎంహెచ్‌వో, గద్వాల

భాజపా సభ్యత్వ నమోదులో ఎంపీ


సభ్యత్వ నమోదులో పాల్గొన్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాల పట్టణంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం కార్యక్రమంలో భాగంగా గద్వాల క్లాత్ మర్చంట్ అసోసియేషన్, గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ల సభ్యులు ఎంపీ డీకే అరుణ సమక్షంలో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఆయా అసోసియేషన్ల ప్రతినిధులు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు శివ, గోల్డ్‌స్మిత్ అసోయేషన్ సభ్యులు శంకరయ్యలతో పాటు పలువురు మహిళలు, యువకులు సభ్యత్వం తీసుకున్నారు. భాజపాకు చెందిన నాయకులు, కార్యకర్తలున్నారు.

నేడు ధర్మకర్త మండలి ప్రమాణ స్వీకారం

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాల నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను ఆలయ అధికారులు సిద్ధం చేస్తున్నారు. మొత్తం 13 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం కొనసాగుతుంది. అనంతరం ఇందులో ఒకరిని ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు.






రాజోలి: బాలాత్రిపురసుందరిగా.. ధరూరు: కాళికాదేవి ఆలయంలో.. ఐజ: బీమునిపల్లి ఆలయంలో.. మానవపాడులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో.. అయిజ: కన్యకాపరమేశ్వరి ఊరేగింపులో మహిళలు

బాలాత్రిపురసుందరిగా అమ్మవారు

అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు, మహామంగళహారతి, సహస్రనామార్చన పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో మండపాలు నిర్మించి అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. - న్యూస్‌టుడే బృందం





మల్దకల్‌లో పార్వతీమాతను ఊరేగింపు.. గట్టు: భవానీ ఆలయంలో మహిళల పూజలు..గద్వాల: కన్యకాపరమేశ్వరి ఆలయంలో.. ఉండవల్లి: అనసూయమ్మ కాలనీలో..

పకడ్బందీగా డిజిటల్ కార్డు సర్వే


అయిజలో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ జ్యోతి

అయిజ, ధరూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అయిజ పుర కమిషనర్ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ జ్యోతి పేర్కొన్నారు. గురువారం అయిజ పురపాలికలో మూడో వార్డులో పైలట్ సర్వే నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. జాబితాలో పేర్కొన్న ప్రకారం కుటుంబానికి సంబంధించిన సమగ్రసమాచారాన్ని సర్వే పత్రంలో పొందుపరచాలన్నారు. వార్డు పరిధిలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి, ఎన్ని కుటుంబాలున్నాయనేది ముందుగానే సేకరించిన వివరాల ప్రకారం జాబితా తయారు చేశారు. దీని ఆధారంగా సర్వేను పూర్తిచేయాలని వారు సిబ్బందికి సూచించారు. కౌన్సిలర్ దేవరాజు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలించిన ప్రత్యేక ఉప కలెక్టర్: కేటీదొడ్డి మండలంలో మైలగడ్డలో సర్వేను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. డీపీవో శ్యాంసుందర్, ఎంపీడీవో కృష్ణమోహన్, డిప్యూటీ ఎమ్మార్వో శివశంకర్ సర్వేను పరిశీలించారు.

పాఠశాల పునః ప్రారంభించండి


పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న దృశ్యం

మల్దకల్, న్యూస్‌టుడే: ఎద్దులగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులు లేరనే నెపంతో మూసివేశారని గ్రామంలో విద్యార్థులున్నారని అధికారుల తప్పిదం వల్లే ఇలా జరిగిందని పాఠశాలను తిరిగి ప్రారంభించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆల్‌ఇండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మార్గం ప్రకాశ్ డిమాండ్ చేశారు. గురువారం ఎద్దులగూడెం సందర్శించి ఇంతకు కిందట ఉన్న ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి పాఠశాల మూతపడిందన్నారు. గ్రామ విద్యార్థులు వ్యయప్రయాసలకోర్చి మల్దకల్‌కు వెళ్లి చదువుకుంటున్నారని, పేద విద్యార్థులు అక్కడికి వెళ్లలేక చదువుకు దూరమవుతున్నట్టు గుర్తించామన్నారు. విద్యార్థులతో కలిసి పాఠశాల దగ్గర వెళ్లి నిరసన తెలిపారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజు, ఆర్‌ఎస్‌పీడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు బల్గెర సునంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..




గద్వాల బీమ్‌నగర్ కాలనీలో పోస్టాఫీసు నుంచి ప్రాజెక్ట్ సింగ్ హైస్కూలుకి వెళ్లే మార్గంలో డ్రైనేజీపై కల్వర్టు పక్క గోడలు నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ మార్గంలో ద్విచక్రవాహనదారులు, పాదచారులు నిత్యం తిరుగుతూ ఉంటారని, రాత్రి వేళలో దారి కనిపించక మురుగుకాల్వలో పడి గాయాలతో బయటపడిన సందర్భాలున్నాయని చెబుతున్నారు. సంబంధిత ఇంజినీర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పురపాలిక ఇన్‌ఛార్జి మేనేజర్ రాజేశ్ తెలిపారు. -న్యూస్‌టుడే, గద్వాల పట్టణం

శిథిలావస్థలో భవనాలు



శిథిలావస్థలో ఉన్న పచ్చర్ల పంచాయతీ భవనం ఇది. తుమ్మిళ్ల, పెద్దధన్వాడ, నసనూరు గ్రామ పంచాయతీ భవనాలదీ ఇదే పరిస్థితి. అన్ని భవనాలు ఇరుగ్గా. పెచ్చులూడుతూ అధ్వానంగా మారడంతో.. సమావేశాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెట్లకింద, ఆరుబయట నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఉంటోంది. మరుగుదొడ్లు సైతం అందుబాటులో లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఖాజామొహినుద్దీన్ తెలిపారు. -న్యూస్‌టుడే, రాజోలి

అధికారులు మారినా.. పేర్లు మారలే



మల్దకల్ ప్రభుత్వ సామాజిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన పట్టికలో అధికారుల పేర్లను మార్చలేదు. డీపీఎండబ్ల్యూ పేరు ఖాళీగా ఉంచారు. హెచ్‌డబ్ల్యూఓ టి.కృష్ణ బదిలీపై వెళ్లి ఆయన స్థానంలో శ్రీనివాసులు వచ్చినా పేరు మార్చలేదు. కుక్ సంటెన్న విరమణ చేసినా ఆయన పేరును అలాగే ఉంచారు. సమాచార హక్కు కోసం వచ్చిన వారికి ఈ పట్టిక ఉపయోగపడుతుంది. సంబంధిత అధికారులు స్పందించి పేర్లను మార్చాల్సిందిగా కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మల్దకల్

కొత్త స్తంభం ఏర్పాటు



స్పందనకు వందనం

ఔంకారంలో విద్యుత్ స్తంభం కర్రలు తేలిన వైనంపై 'ఈనాడు'లో సెప్టెంబరు 30న 'ప్రమాదకరంగా స్తంభం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ శివకుమార్, లైన్‌మ్యాన్ సుందర్‌రాజ్ గురువారం గ్రామంలో పాత స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. -న్యూస్‌టుడే, ఉండవల్లి

'పేదల ఇళ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా'

మల్దకల్, న్యూస్‌టుడే: పేదల ఇళ్లను కూల్చడం ఇందిరమ్మ రాజ్యమా అని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బందారి రాజు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి రెండింటిని మాత్రమే అమలు చేసి మిగతా వాటికి ఎగనామం పెట్టిందని ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రుణమాఫీ మధ్యలోనే ఉందని, పింఛన్లు పెంచే ప్రసక్తి లేదని, గృహజ్యోతి ఎప్పుడు అమలవుతుందో ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. మండల శాఖ అధ్యక్షుడు గోవిందు, ప్రధాన కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

ఆదిశిలావాసుడికి ఆభరణాల వితరణ


ఆభరణాలు అందజేస్తున్న శ్యామ్‌రావు

మల్దకల్, న్యూస్‌టుడే: మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలో వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామికి ధరూరు మండలం మన్నాపురం గ్రామానికి చెందిన శ్యామ్‌రావు దంపతులు 20గ్రాముల బంగారు ఆభరణాలను గురువారం వితరణ చేశారు. వీటి విలువ రూ.లక్షకు పైగా ఉన్నట్లు తెలిపారు. ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో స్వామివారికి బంగారు ఆభరణాలు అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాత దంపతులకు ఆలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు స్వామి శేషవస్త్రం, జ్ఞాపికతో సన్మానించి స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

ఆలయాలను దర్శించుకున్న శ్రుతి


బంగారు శ్రుతికి ప్రసాదం అందజేస్తున్న ఈవో పురేందర్

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాలను గురువారం భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి దర్శించుకున్నారు. అర్చకులు ఈవో పురేందర్ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇసుక అక్రమ రవాణా : అధికారులపై వేటు


ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న పొక్లెయిన్(పాత చిత్రం)

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: దుందుభి వాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాలో విఫలమైన అధికారులపై వేటు పడింది. ప్రత్యేక నిఘా బృందం సేకరించిన సమాచారం మేరకు వంగూరు, ఉప్పునుంతల, తెలకపల్లి, బిజినేపల్లి ఎస్సైలు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. దీంతో వీరిని ఠాణా నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి డివిజన్ల పరిధిలో మొదటిసారి ఎస్సైలపై వేటు పడటంతో గనులు, రెవెన్యూ, పోలీసు అధికారుల్లో చర్చ మొదలైంది. మార్చి నుంచి జూన్ వరకు వాగు పరిధిలో విధులు నిర్వహించి వసూళ్లకు పాల్పడిన అధికారుల్లో భయాందోళన మొదలైంది.

● దుందుభి వాగు పరిసర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు తీసుకున్న వ్యాపారులు ఈ ఏడాది జులై వరకు టన్నుల కొద్దీ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారు. ఉప్పునుంతల మండలం సదగోడు, మొల్గర, తిర్మలాపూర్, దాసర్లపల్లి, కాంసానిపల్లి, వంగూరు మండలం మిట్టసదగోడు, చింతపల్లి, పోతిరెడ్డిపల్లి శివారు వ్యవసాయ పొలాల్లో డంపులు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ నిల్వ చేసిన ఇసుకను ట్రాక్టర్‌కు రూ.4వేల చొప్పున అధికారుల అండదండలతో అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణానికి అనుకూల సమయం కావడంతో రవాణా జోరందుకుంది. ఈ నేపథ్యంలో ఇసుక రవాణాను అరికట్టడంలో విఫలమైన అధికారులపై వేటు పడింది.

రైతు సమస్యలపై పోరాటం


లింగనవాయిలో ఏర్పాటు చేసిన గ్రామసభ

అలంపూర్, న్యూస్‌టుడే: లింగనవాయి గ్రామంలో గురువారం సీపీఎం గ్రామసభ మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజు మాట్లాడుతూ రైతులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని వెల్లడించారు. రుణమాఫీ, రైతు భరోసా, బీమా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, వీధి స్తంభాలు, సాగు, తాగు నీటి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. పార్టీ గ్రామ కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వెల్లడించారు. జిల్లా మహాసభలకు 5 మంది పార్టీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ నెల 6వ తేదీన అలంపూర్ పట్టణంలో కేవీపీఎస్ కార్యాలయంలో పార్టీ మండల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరసింహ, వెంకట్ రాముడు, మధుసూదన్, రహీం, బీచుపల్లి, సోమశేఖర్, నజీర్, తదితరులు పాల్గొన్నారు. పార్టీ గ్రామ కార్యదర్శిగా ఈదన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

108 వాహనంలో ప్రసవం


అంబులెన్స్‌లో తల్లీబిడ్డలతో సిబ్బంది

అలంపూర్, న్యూస్‌టుడే: ఊట్కూర్ గ్రామానికి చెందిన సువర్ణకు బుధవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావటంతో అలంపూర్ ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. వైద్యులు పరిశీలించి కర్నూల్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. 108 వాహనంలో తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువయ్యాయి. 108 సిబ్బంది ఈఎమ్‌టీ శేఖర్, పైలట్ దేవేందర్ జాగ్రత్తగా సేవలు అందించడంతో మగబిడ్డను ప్రసవించింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించినట్లు ఈఎమ్‌టీ తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతానికి పిలుపు

మల్దకల్, న్యూస్‌టుడే: మల్దకల్ మండల కేంద్రంలో త్వరలో నిర్వహించే భారాస ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని పార్టీ నాయకుడు శేఖర్‌నాయుడు పిలుపునిచ్చారు. గురువారం పెద్దపల్లె, పాలవాయి తదితర గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు తీవ్రంగా కృషి చేయాల్సి ఉంటుందన్నారు. నాయకులు గట్టు ఎస్ రాములు, తిరుమలేశ్, గోపాల్, వీరేశ్, కరుణాకర్, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.


పెద్దపల్లెలో కార్యకర్తలతో భారాస నాయకుల నినాదాలు

జిల్లాలో గాలివాన బీభత్సం


గద్వాల: ఈదురు గాలులకు నేలకొరిగిన భారీ కటౌట్

గద్వాల పట్టణం, ఉండవల్లి, అలంపూర్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలుల ధాటికి స్థానిక పాతబస్టాండ్ వైఎస్సార్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన ఓ నాయకుడి భారీ కటౌట్, ఫ్లెక్సీలు నేలకొరిగాయి. అక్కడే తోపుడు బండిపై పల్లీలు విక్రయిస్తున్న ఓ మహిళకు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. * అలంపూర్ జోగులాంబ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు అలంపూర్‌చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రవేశద్వారం రోడ్డుకు అడ్డంగా కూలి పడింది. వెంటనే స్పందించిన ఉండవల్లి ఠాణా పోలీసులు, జాతీయ సిబ్బంది దాన్ని తొలగించారు. ● అలంపూర్ ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, ఆహ్వాన కట్ అవుట్లు నేలకు ఒరిగాయి.



ఉండవల్లి: రోడ్డుపై పడిన వాటిని తొలగిస్తున్న జాతీయ రహదారి సిబ్బంది.. అలంపూర్: పడిపోయిన చలువ పందిరి

లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్


వృద్ధులతో మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో నెలనెలా సక్రమంగా పింఛన్లు అందించడంలేదని భాజపా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన అయిజ పట్టణంలోని పాతబస్టాండు, దుర్గానగర్ తదితర కాలనీల్లో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. పింఛన్లు, రైతుబంధు, రుణమాఫీ, కల్యాణ లక్ష్మి తదితరాలకు సంబంధించిన డబ్బులు లబ్ధిదారులకు సక్రమంగా అందించడంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే వారికి డబ్బులు చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గోపాలకృష్ణ, నాయకులు భగత్ రెడ్డి, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నూనె రవాణాదారుల అరెస్టు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై గంజాయి నూనె (హాష్ ఆయిల్)ను రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం ఏనుగొండ సమీపంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ధర్మేంద్రరాయ్, నరెట్టమ్‌రాయ్ గంజాయి నూనెను హైదరాబాద్, రాయచూర్ ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ఎండు గంజాయి ఆకులతో ఈ నూనె తయారు చేస్తారు. ఆ నూనెను మత్తు కోసం సిగరెట్ తాగేటప్పుడు వాడుతారు. గురువారం ఇద్దరు నిందితులు హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు గంజాయి నూనెను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం వచ్చింది. వారు మహబూబ్‌నగర్‌లోని పిస్తా హౌజ్ వద్ద తనిఖీలు చేయగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.25లక్షల విలువ చేసే గంజాయి నూనె లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శివ, సిబ్బంది మౌలాలీ, శివదాస్, భరత్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.